సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 108 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 19.08.2025



వినోదం, క్రీడలతో

## దివ్యాంగుల్లో సంతోషం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

పేజీ 2

# ఎరువుల కోసం రోడ్డెక్కిన రైతులు

- ఎల్కతుర్తిలో రైతన్నల ధర్నా

**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో హనుమకొండ, హుజురాబాద్ ప్రధాన రహదారిపై రైతులు యూరియా కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతుల కోసం పనిచేయాలి తప్ప రాజకీయాలు పక్కకు పెట్టాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి సరిపడా యూరియా తక్షణమే కేంద్ర ప్రభుత్వం అందించాలని అదేవిధంగా దానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.





# ఆఫీసర్లు అలర్ట్‌గా ఉండాలి

- యూరియా సమృద్ధిగా ఉంది
- సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో భారీ వర్షాల నేపథ్యం లో అధికారులంతా అలర్ట్‌గా ఉండాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే అనంతరం జిల్లా అధికారులతో భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి వంటి అంశాలపై సమీక్షించారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలకు శిథిలావస్థకు చేరిన భవనాల్లో ప్రజలను ఉండనీయరాదని, అదేవిధంగా పొంగిపొర్లుతున్న వాగులు వంకలు దాటినీయరాదని తెలియజేశారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటిస్తూ , ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఫర్టిలైజర్స్ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా, మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని దోమలు ప్రబలే అవకాశం ఉన్నందున ఫాగింగ్ చేపట్టాలన్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలు రాకుండా ఫీవర్ సర్వేకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ 24 ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర పరిస్థితులల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ కు 9052308621 సమాచారం అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు ఇందిరమ్మ ఇండ్లకు సరఫరా చేసే ఇసుకలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డీఓ గోపి రామ్, డిప్యూటీ కలెక్టర్లు కొమురయ్య, సుహాసిని, డీఆర్డీవో వసంత జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ పలు ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు.



wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
The Complete News way
19.08.2025 మంగళవారం
Mana Chourasta


# దివ్యాంగులకు వినోదం, క్రీడలు ఎంతో అవసరం



## గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** దివ్యాంగులకు వినోదం, క్రీడలు ఎంతో అవసరమని, వాటి ద్వారా వారు సంతోషంగా ఉంటారని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో, సేబుల్ ట్రస్ట్, బద్రీ విశాల్ పానలాల్ పిట్టి ట్రస్ట్, అగర్వాల్ సేవాదళ్, మహావీర్ వికలాంగ సహాయత సమితి, డాక్టర్ నారీ చారిటబుల్ ట్రస్ట్, రామదేవ్ రావు హాస్పిటల్, జనజాగృతి ట్రస్టుల సహకారంతో ఉచిత మెగా శస్త్రచికిత్స, వైద్య శిబిరం నిర్వహించారు. సోమాజిగూడలోని సంస్కృతి రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి వికలాంగులకు ఎలక్ట్రిక్ వెహికల్స్, కర్రలు, కేలిపర్స్, కృత్రిమ అవయవాలు, వాకర్స్ మరియు వీల్ చెయర్లను పంపిణీ చేశారు. ప్రత్యేక అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్, హైదరాబాద్ కలెక్టర్ హరీచందన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిసేబుల్ చైర్మన్ వీరయ్య, రెడ్ క్రాస్ స్టేట్ సీఈఓ శ్రీరాములు, ఎమ్మెల్యే కలా యాదయ్య, రెడ్ క్రాస్ చైర్మన్ భీమ్ రెడ్డి, డా.విజయ్ భాస్కర్ (ఆర్గనైజింగ్ చైర్మన్) పాల్గొన్నారు. డాక్టర్ కీర్తనా యాదవ్ (ఫౌండర్, డాక్టర్ నారీ చారిటబుల్ ట్రస్ట్) ఈ శిబిరం నిర్వహణలో, అలాగే వైద్య బృందాన్ని మోబిలైజ్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. గంగారాం (ఎఫ్ఈడీసంస్థ), శ్రీనివాస్ (వికలాంగుల నెట్‌వర్క్), నామ నాగేశ్వర్, కిరణ్ గుటికొండ వికలాంగులను వివిధ ప్రాంతాల నుంచి మోబిలైజ్ చేయడంలో సహకరించారు. అలాగే రెడ్ క్రాస్ బృందంలోని విజయ, అనురాధ శిబిర విజయవంతానికి కృషి చేశారు.


# పాపన్న ఆశయాలు కొనసాగించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఘనంగా సర్దార్ పాపన్న జయంతి




**జనగామ, మన చౌరాస్తా :** బహుజన నాయకుడు, పోరాట యోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుబడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు తెలిసేలా కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ని మినీ కాన్ఫరెన్స్ హల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ విచ్చేసి పాపన్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ జిల్లా కవులు, కళాకారులకు నిలయమని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర రచించి భావితరాలకు పుస్తక రూపంలో అందించాలన్నారు. అణగారిన వర్గాల, శ్రమజీవుల కష్టాన్ని దోచుకునే వారిని ఎదిరించి పోరాడి సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపించిన మహానీయుడని కొనియాడారు. చైతన్యానికి స్ఫూర్తి నిచ్చిన పోరాట యోధుని గాథలు ప్రతి ఒక్కరికి తెలియలన్నారు. జనగామ పట్టణ ముఖద్వారమైన హైదరాబాద్ రోడ్ లో సర్దార్ సర్వాయి పాపన్న తో పాటు బడుగు బలహీన వర్గాల కు అండగా నిలిచిన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాట యోధుల చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఎక్సైజ్ శాఖ అధికారి అనిత, బీసీ కుల సంఘ ప్రతినిధులు, ఇతర కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌లో రామగల్ల అంజయ్య మృతి



**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణానికి చెందిన గౌతమి ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ రామగల్ల అంజయ్య(60) బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన అంజయ్య ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు హుటాహుటిన చేర్యాల పట్టణంలోని అక్షర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తన కళ్ళముందే సోదరుడు అంజయ్య అకస్మాత్తుగా మరణించడంతో తమ్ముని మరణాన్ని తట్టుకోలేక జేఏసీ చైర్మన్ డా.పరమేశ్వర్ కన్నీటి పర్యంతమయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## పెద్దమడూర్‌లో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని బబ్బురి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దమడూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు కంఠమహేశ్వర గుడి వద్ద గల పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత బహుజన వీరుడు, ఔరంగజేబును ఓడించి గోల్కొండ కోటను జయించిన ధీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.



## కేజీకేఎస్ పోరాటంతోనే ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం



**చేర్యాల, మన చౌరాస్తా :** తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం పోరాట పలితంగానే హైదరాబాదు నడిబొడ్డున ఉన్న ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణ శంకుస్థాపన జరిగిందని కల్లుగీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ అన్నారు. సోమవారం చేర్యాల మండలం అర్జున్ పట్లలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి సంఘం నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీకేఎస్ ఎన్నో ఏళ్ల పోరాటం ఫలితంగా హైదారాబాద్ లోని ట్యాంకు బండ్ వద్ద ఈ రోజు ముఖ్యమంత్రి సర్వాయి పాపన్న విగ్రహానికి భూమి పూజ చేస్తున్నాడని తెలిపారు. 2016 లో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నాలుగు గోడల మధ్య ఉన్న పాపన్నను రాష్ట్రం నలు దిక్కుల ప్రచారం చేసిన బస్సు యాత్ర ఖిలాషాపురం నుంచి గోల్కొండ కోటకు జైత్రయాత్ర చేశామని, నాడు ప్రధాన డిమాండ్ పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ట్యాంకుబండ్ పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలన్న తపన నేటికీ నెరవేర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొల్లపల్లి చంద్రమౌళి, గ్రామ మాజీ సర్పంచ్ బింరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సింగపాక లక్ష్మి కనకయ్య, సంఘం రాష్ట కమిటీ సభ్యులు అనగోని నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళపల్లి నర్సింహులు, లింగాల బాలయ్య, తాళ్ళపల్లి తిరుచైయ్య, మండల సోషల్ మీడియా కన్వీనర్లు మహేష్, సురేష్, సంఘం నాయకులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## బహుజనుల అభివృద్ధికి కట్టుబడిన కాంగ్రెస్

**ట్యాంక్ బండ్‌పై సర్దార్ విగ్రహం ఏర్పాటుపై హర్షం**

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** బహుజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లింగంపల్లి కనకరాజు అన్నారు. పాపన్న జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కనకరాజు మాట్లాడుతూ బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. పాపన్న గౌడ్ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషిని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో ఖిలాషాపూర్ కోట చరిత్రను కాలగర్భంలో కలిపేందుకు కుట్ర చేసిందని ఆయన ఆరోపించారు. ఆనాడే కోటపైకి వెళ్లి దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ట్యాంక్ బండుపై విగ్రహ ఏర్పాటు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అదే విధంగా ప్రభుత్వ పెద్దలకు ప్రజాప్రతినిధులకు పార్టీ శ్రేణులకు ముఖ్యంగా టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



# ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు అభినందన

**చిగురుమామిడి, మన చౌరాస్తా :** చిగురుమామిడి మండలం ముల్కనూర్, మోడల్ స్కూల్ విద్యార్థినిలు స్నేహిత కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్ బాడ్ టచ్ రెస్పాండింగ్ డాల్ ప్రాజెక్టును అటల్ టింకరింగ్ ల్యాబ్ లో రూపొందించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పవతి ముందు ప్రాజెక్టును ప్రదర్శించగా కలెక్టర్ కొన్ని మార్పులను సూచిస్తూ మార్గదర్శనం చేశారు. ప్రాజెక్టులో ముఖ్యంగా వాయిస్ రికార్డింగ్ ద్వారా గుడ్ టచ్ బాడ్ టచ్ కు సంబంధించిన విషయాలన్నింటినీ నిక్షిప్తం చేయాలని, బ్యాడ్ టచ్ చేసిన వారి వివరాలను నమోదు చేసుకునే విధంగా రూపొందించాలని ఆదేశించారు. పాఠశాల లోని బాలురందరూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రాజెక్టును రూపొందించిన వైష్ణవి, అను శ్రీ, గైడ్ టీచర్లు కొండల్ రెడ్డి, ముక్తి ప్రసాద్, పీజీటీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ ను కలెక్టర్ అభినందించారు.

# ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం

## గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :**

ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే పురస్కరించుకొని ప్రజావాణి కార్యక్రమంలో 34 దరఖాస్తులను స్వీకరించారు. అందులో కొన్ని దరఖాస్తులు ఈ విధంగా ఉన్నాయి. జనగామ మండలం చౌడారం గ్రామంలోని యాసారపు రవి తన దరఖాస్తు అందిస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. చిల్పూర్ మండలం పల్లగుట్టకు చెందిన దారా ఝాన్సీ తన దరఖాస్తు అందిస్తూ భర్త చనిపోయారని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని కూలీ పనుల పైనే జీవిస్తున్నందున డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

దేవరుప్పల మండలం రామచంద్రాపురం గ్రామంలో 2022- 23 లో ఐదు లక్షలతో డ్రైనేజీ నాసిరకం పనులతో నిర్మించినందున కూలిపోయిందని నాణ్యత ప్రమాణాలపై పర్యవేక్షణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి, ఇన్నారెడ్డి, రమేష్, సోమాజి, ఆంజనేయులు తదితరులు ఫిర్యాదు చేశారు. లింగాలఘణపురం మండలంలోని కుందారానికి చెందిన పాలమాకుల అంజయ్య సర్వేనెంబర్ 145లోని తనకు రావలసిన వ్యవసాయ భూమిని తన అన్న పట్టా చేయించుకున్నారని, తనకు న్యాయం చేకూర్చాలని దరఖాస్తు అందించారు. గోపరాజుపల్లికి చెందిన పిడుగు ఆశీర్వాదం తన పంట పొలంలోకి మోరి లోని నీరు వచ్చి నష్టం జరుగుతున్నదని తనకు తగిన న్యాయం చేకూర్చాలని విజ్ఞప్తిని అందించారు. గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డిఓ గోపిరామ్, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, కొమరయ్య, డీఆర్డీవో వసంత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.






# విద్యార్థులకు నగదు బహుమతి

**చేర్యాల, మన చౌరాస్తా :** ఆకునూర్ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన 3, 4, 5వ తరగతి విద్యార్థులకు గ్రామ వాస్తవ్యులు ఎన్ఆర్ఐ సోమిరెడ్డి రామకృష్ణారెడ్డి వారసుల సహకారంతో సోమవారం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడిచెల్మి అయోధ్య చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు అయోధ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులచే చక్కటి నాణ్యమైన విద్య బోధన జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు విద్యార్థులు సహకరించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో చదువులో మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పోటీపడి చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషకర విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంసుందర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, సమ్మయ్య, రాజయ్య, రాధాబాయి, సరోజినీ దేవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అందె అశోక్, కోతి దాసు, సూర రాజు, సూర సంపత్, పులిగిళ్ల సంపత్, కే.యాదగిరి, కోయినేని శ్రీనివాస్, తొట్టె రమేష్, ఉడుత విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, అన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు సురేందర్ రెడ్డి, మధుకర్, ఆలయ సిబ్బంది, దేవాలయ వేద పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ కగారును నిలిపివేయాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24 ఆగస్టున అంబేద్కర్ భవన్ వరంగల్లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఉమ్మడి హనుమకొండ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కో కన్వీనర్ కొత్తూరు ఇంద్రసేన ఆధ్వర్యంలో కరపత్రం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంద్రసేన మాట్లాడుతూ మధ్య భారత దేశంలో ఆదివాసీల యొక్క హత్యాకాండను నిరసిస్తూ ఆపరేషన్ కగారును నిలిపివేసి పోలీస్ క్యాంపులు ఎత్తివేయాలని, తక్షణమే కాలుపుల విరమణ ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1/70 యాక్ట్ అమలు చేయాలని, అటవీ హక్కుల పరిరక్షణ చట్టం,పెస చట్టం గ్రామసభ తీర్మానాలు అమరుచాలని ఆదివాసులను చంపే హక్కు ఎవరికీ లేదని రాజ్యాంగంలో ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాయొద్దని అన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గొల్లూర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ దేశ సంపదపై హక్కు కొంతమంది కార్పోరేట్లకు మాత్రమే లేదని ఈ దేశ సంపద దేశ ప్రజలందరిదని అన్నారు. బహిరంగ సభకు ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు,మహిళా, దళిత సంఘాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి జేఏసీ నాయకులు డ్యాగల సారయ్య, భారత రాష్ట్ర సమితి మాణిక్యపుర్ గ్రామ అధ్యక్షులు కోన భరత్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం బొల్లంపల్లి రాజు,సిపిఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్, తెలంగాణ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి జగన్, రాష్ట్ర కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, తెలంగాణ రైతాంగ సమితి డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, మండల కన్వీనర్ గజ్జి శ్రీనివాస్, బంధుమిత్రుల సంఘం నాయకులు గజవెల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.






# ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సమావేశం జనగామ జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షులు ఈర్రి అహల్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆశలత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆర్ గ్యారంటీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఉచిత బస్సు ఒక్కటి తప్ప మిగతావన్నీ అటకెక్కాయన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలన్నీ సంపూర్ణంగా అమలు చేయాలని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండి షబానా, జిల్లా కమిటీ సభ్యులు బండ రమాదేవి, చింతల శ్రీలత, మానేపల్లి నిర్మల, కొండ వరలక్ష్మి, మనీ, శ్రీపతి మమత, పరుష లక్ష్మి పాల్గొన్నారు.









# జనగామ జిల్లాకు పాపన్న పేరుపెట్టాలి

## తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడిద గోపి

**జనగామ, మన చౌరాస్తా :**

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడిద గోపి కోరారు. సోమవారం పాపన్న జయంతి సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కల్లు గత కార్మిక సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సభలో గోపి మాట్లాడుతూ జనగామ జిల్లా ఖిలా షాపురం గ్రామంలో పుట్టిన సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి జమీందారులు, భూస్వాములు, నైజాం రాజులకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని అన్నారు. జనగామ ప్రాంతంలో ఏ గ్రామానికి పోయిన పాపన్న ఆనవాళ్లు ఉన్నాయని, పాపన్న వీరోచిత పోరాటాన్ని బడుగు బలహీన వర్గాలను ఐక్యం చేసిన తన ఆలోచన విధానాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య, కల్లుగీత కార్మిక రాష్ట్ర గౌరవ సలహాదారు భీమగోని చంద్రయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్, సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాల్నే రాజయ్య, బసవ గాని మహేందర్, బైరగోని వెంకటయ్య, గోపా సీనియర్ నాయకులు కన్నా పరశురాములు, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, బండపల్లి శంకరయ్య, జనగామ సొసైటీ నాయకులు పాముకుంట్ల కృష్ణమూర్తి, పాముముకుంట్ల కుమారస్వామి, పాముకుంట్ల మధుకర్, ఆలేటి నరేందర్, చీకట్ల నవీన్, మచ్చ ప్రవీణ్, పంతం సాయి ప్రసాద్, బండపల్లి సోమేశ్వర్, బూడిది చంద్రశేఖర్, దూసరి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భజరంగ్ ప్రసాద్‌కు జాతీయ అవార్డు

**నల్లగొండ, మన చౌరాస్తా :** ఫొటో అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన ఉత్సవాలు 2025 సందర్భంగా నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీలలో తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి, నల్లగొండ జిల్లాసాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ గోల్డ్ మెడల్‌ను సాధించారు. విజయవాడ మహాత్మా గాంధీ రోడ్ ఎంబీవీకే బాలోత్సవ్ భవన్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూక స్వామి బాలాజీ, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు కొంపెల్లి సుందర్ , అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్,




మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు, ఆంధ్ర ఆంధ్ర ప్రదేశ్ సృజనాత్మకత సాంస్కృతిక సమితి డైరెక్టర్, సీఈవో మల్లికార్జునరావు, ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ పౌండర్ చైర్మన్, సెక్రటరీ టి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా భజరంగ్ అవార్డును అందుకున్నారు.



## గానుగుపహాడ్ చీటకోడూర్
# వంతెనలు నిర్మించాలి

జనగామ, మన చౌరాస్తా : గానుగుపహాడ్, చిటకోడూర్ బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 19 వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం నాటి దీక్షను జనగామ జిల్లా కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి. కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. జనగామ మండలంలోని వడ్లకొండ, గానుగుపహాడ్ వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద పిల్లర్ల వరకు ఆపిన వంతెన పనులు పూర్తి చేయాలన్నారు. యశ్వంతాపూర్ వాగు మీద చిటకోడూర్ వద్ద భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా ప్రజల రవాణా కష్టాలు తీర్చాలని కోరారు. దీక్షలో పాలకుర్తి పోతన సాహిత్య వేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్, తెలంగాణ రాష్ట్ర గౌడ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, బాల్నె ఉమాపతి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్రా వీరస్వామి, తెలంగాణ ఉద్యమ కవి గాయకులు మేడ సుధాకర్, రాగల్ల శ్రీహరి, గండి శ్రీనివాస్ మాదిగ, ఉమాపతి గౌడ్, భాను చందర్, వై.సంపత్, గంధమల్ల సదానందం, చెరుకూరి సిద్ధయ్య పాల్గొన్నారు.

# ఖిలషాపూర్ పాఠశాల రూపు రేఖలు మారుస్తాం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ఖిలషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, అటల్ థింకరింగ్ ల్యాబ్‌లను



ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గౌడ కమ్యూనిటీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖిలషాపూర్ ప్రభుత్వ పాఠశాలకు గొప్ప పేరు ఉందని అన్నారు. బహుజన పోరాట యోధుడు పుట్టిన గ్రామంలో ప్రతీ ఒక్క విద్యార్థి బాగా చదివి ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఖిలషాపూర్ ప్రభుత్వ పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని, విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని అన్నారు. అలాగే మండల పరిషత్ పాఠశాలలో టాయిలెట్స్, అదనపు తరగతిగదులు, ప్రహరీ గోడ నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, త్వరలోనే మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.